పెన్షన్.. టెన్షన్!



బూసాయవలసలో మంచానికి పరిమితమైన పింఛన్‌దారు అర్హతలను పరిశీలిస్తున్న వైద్య బృందం

- నకిలీల పేరుతో పింఛన్ల తొలగింపునకు సన్నాహాలు
- వైద్య బృందంచే తాజాగా సర్వేలు
- నియోజకవర్గంలో కొనసాగుతున్న పరిశీలనలు
- ఆందోళనలో లబ్ధిదారులు

రామభద్రపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పింఛన్ల సంఖ్య క్రమక్రమంగా తగ్గుతూ వస్తోంది. నకిలీల పేరిట పింఛన్ల తొలగింపు ప్రక్రియకు చంద్రబాబు సర్కారు శ్రీకారం చుట్టడంతో లబ్ధిదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య బృందాలు క్షేత్రస్థాయిలో దివ్యాంగుల పింఛన్ల ఏరివేతకు సర్వేలు చకచకా నిర్వహిస్తున్నాయి. పింఛన్‌దారుల ఇంటింటికీ వెళ్లి, వారి అర్హత ధ్రువపత్రాలను పరిశీలిస్తున్నారు. ఒక్కో లబ్ధిదారు ఇంటి వద్ద గంట కాలం పాటు విచారణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎవరి పింఛన్ ఉంచుతారో.. ఎవరి పింఛన్ లేపేస్తారోనన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పింఛన్ పెరిగిందన్న సంతోషం.. ఆరేడు నెలల్లోనే ఆవిరైపోయినట్లు ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కక్షపూరితంగా పింఛన్లు తొలగించాలని చూస్తున్నారని.. ఇలా అయితే చాలామంది అర్హులు నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

ఈ నెల 6 నుంచి..

బొబ్బిలి నియోజకవర్గ వ్యాప్తంగా ఈ నెల 6వ తేదీ నుంచి పింఛన్‌దారుల అర్హతలపై ఆరా తీసేందుకు వైద్యాధికారుల బృందాలు బయలుదేరాయి. 6న బొబ్బిలి టౌన్, రూరల్‌తో పాటు బాడంగి మండలం, 7న బొబ్బిలి, తెర్లాం మండలాలు, 20న రామభద్రపురం మండలంలో శ్రీకాకుళం రిమ్స్ నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్ జనరల్ పి.శైలజ, నరసన్నపేట ఏరియా ఆస్పత్రి నుంచి వచ్చిన ఆర్థోపెడిక్ వైద్యుడు బి.రమణలతో కూడిన వైద్యం బృందం బోగస్ పింఛన్ల ఏరివేతకు వెరిఫికేషన్ చేపట్టారు.

తొలి విడతలో రూ.15 వేల పింఛన్లు..

తొలి విడతలో మంచానికే పరిమితమై నెలకు రూ.15 వేలు పింఛన్ పొందుతున్న వారి ఇళ్లకు వెళ్లి, వారి పింఛన్లు సక్రమమేనా అనే దిశగా విచారణ చేపడుతున్నారు. ఒక్కో వ్యక్తి వద్ద అరగంట నుంచి గంట కాలం పాటు విచారణ కొనసాగిస్తున్నారు. పింఛన్ డబ్బులే ఆధారంగా జీవనం సాగిస్తున్న కొన్ని దివ్యాంగ కుటుంబాల వారు ఇప్పుడు జరుగుతున్న వెరిఫికేషన్(పరిశీలన) చూసి, తమ పింఛన్ తొలగిస్తే ఏం చేయాలని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ చర్యలు దుర్మార్గం..



దివ్యాంగుల పింఛన్ల తొలగించేందుకు ప్రభుత్వం సర్వేలు చేయిస్తుండడం దుర్మార్గం. అనర్హులు కూడా పింఛన్లు పొందుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ప్రస్తుతం రూ.15 వేలు పింఛన్ పొందుతున్న వారి అర్హతలను వైద్య బృందాలు పరిశీలిస్తున్నాయి. తర్వాత రూ.6 వేల పింఛన్ పొందుతున్న వారి అర్హతలను పరిశీలించనున్నారు. పింఛన్ పెంచినట్లే పెంచి, పింఛన్‌దారుల తొలగింపు ఎందుకు? పేద వాడి పింఛన్ తొలగిస్తే నోటి దగ్గర కూడు లాగేసుకున్నట్లే.

– శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యే, బొబ్బిలి

ప్రభుత్వ ఆదేశాలతోనే సర్వేలు..



ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే సర్వేలు చేస్తున్నాం. ఎవరి పింఛన్ సక్రమం.. ఎవరి పింఛన్ అక్రమం అన్నది వెల్లడించకూడదు. ఒక్కో వ్యక్తి అర్హత నిర్ధారణ పత్రాలు సీల్ చేసి, నివేదికల రూపంలో ప్రభుత్వానికి అందజేస్తాం.

–బి.రమణ, ఆర్థోపెడిక్ వైద్యుడు, శ్రీకాకుళం రిమ్స్

నియోజకవర్గంలో పింఛన్‌దారుల వివరాలు..

మండలం	రూ.15 వేల పింఛన్	రూ.6 వేల పింఛన్
రామభద్రపురం	12 మంది	1015 మంది
బొబ్బిలి	25 మంది	1100 మంది
బాడంగి	ఒకరు	1103 మంది
తెర్లాం	ఆరుగురు	1507 మంది

రెండో విడతలో రూ.6 వేల పింఛన్లు..

రెండో విడతలో భాగంగా ఫిబ్రవరి నెలలో వైద్య బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి, రూ.6 వేలు పింఛన్ పొందుతున్న వారి అర్హతలపై ఆరాతీయనున్నారు. దివ్యాంగుల నిర్ధారణ పత్రాల ఆధారంగా మళ్లీ ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు చేయిస్తామని ప్రభుత్వం చెబుతోంది. కూటమి నాయకుల కుట్రలతో కొన్ని పింఛన్లు తొలగించే అవకాశం ఉందని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో అసలైన లబ్ధిదారులు కూడా తమ పింఛన్ ఏమవుతుందోనని భయపడుతున్నారు.

క్లుప్తంగా

సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు

రాజాం సిటీ: గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో సోమవారం కోరారు. ఇంతవరకు ఆధార్ నమోదు చేసుకోని ఆరేళ్ల వయసులోపు చిన్నారులకు కొత్తకార్డుల కోసం ఈ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. 21, 22వ తేదీల్లో కంచరాం సచివాలయంలో, 23న రాజయ్యపేట, 24న ఎంజీవలస సచివాలయాల్లో ఈ క్యాంపుల నిర్వహణ ఉంటుందన్నారు.

సస్యరక్షణ తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: రబీ సాగులో భాగంగా పండిస్తున్న పంటలు మంచు ప్రభావం కారణంగా పాడవ్వకుండా ఉండాలంటే సస్యరక్షణ చర్యలు తప్పనిసరి అని ఏవో మురళీకృష్ణ సూచించారు. మండలంలోని నాయిరాలవలస, జాడపేట గ్రామాల్లో అపరాల పంటల సాగుపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఏదైనా పంటకు తెగులు సోకితే వ్యవసాయ అధికారులు, సిబ్బంది సూచనల మేరకు నివారణ మందులు వాడాలని తెలిపారు.

దుస్తుల వితరణ

బొబ్బిలి: పట్టణానికి చెందిన వనమిత్ర అధ్యక్షుడు కె.కృష్ణదాసు మాస్టారు.. అడకత్తెరలో ఉంటున్న వలసదారులు(ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్)కు నిత్యావసర సరుకులు, దుస్తులు వితరణ చేశారు. సోమవారం వారి వద్దకు వెళ్లి, వారికి అవసరమైన వస్త్రాలు, వంట సరుకులు అందజేశారు.

బాధ్యతల స్వీకరణ



డీఎస్పీ భవ్యారెడ్డి

బొబ్బిలి: డీఎస్పీగా గుండ్రే భవ్యారెడ్డి.. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డివిజనల్ శాంతిభద్రతలు కాపాడేందుకు కృషి చేస్తానని, ముఖ్యంగా మహిళల రక్షణకు పాటుపడతానన్నారు.

453 మందికి 153 మంది హాజరు



మైదానంలో కూర్చొని మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

బాడంగి: సంక్రాంతి సెలవుల అనంతరం పునఃప్రారంభమైన పాఠశాలలకు వచ్చేందుకు విద్యార్థులు అనాసక్తి చూపిస్తున్నారు. సోమవారం తరగతులకు బాడంగి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మొత్తం 453 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, వారిలో కేవలం 153 మంది మాత్రమే హాజరయ్యారు. తక్కువ మంది విద్యార్థుల రాకతో తరగతులు కూడా అంతగా జరగలేదని సమాచారం.

ముగిసిన బాలఅన్నమ్మ యాత్రా మహోత్సవం



అలరించిన యువతుల నృత్య ప్రదర్శన

సంతకవిటి: మండలంలోని సురవరం గ్రామంలో కొన్నిరోజులుగా జరుగుతున్న బాలఅన్నమ్మ యాత్రా మహోత్సవం సోమవారంతో ముగిసింది. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవంలో భాగంగా అన్నమ్మ పల్లకి ఊరేగింపు వైభవంగా చేపట్టారు. రాత్రి జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి.

మట్టికుండల తయారీ ప్రారంభం



కుండలు తయారు చేస్తున్న కుమ్మర్లు

బొబ్బిలిరూరల్: మండలంలోని పెంట, రంగరాయపురం గ్రామాల్లో మట్టికుండల తయారీ సోమవారం ప్రారంభమైంది. ఏటా సంక్రాంతి పండగ ముగియగానే కుమ్మర్లు ప్రత్యేక ముహూర్తం నిర్ణయించుకుని, పూజలు చేసి మరీ ఇలా కుండల తయారీని ఆరంభిస్తుండడం గమనార్హం. ఈ క్రమంలో కుండల తయారీకి వాడే పనిముట్లు, మట్టికి కుమ్మర్లు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలు కుండలు తయారు చేశారు.

జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు



తెర్లాంలో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న ఏపీవో సుశీల

తెర్లాం: జాబ్‌కార్డు ఉన్న వారందరికీ ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని ఏపీవో సుశీల ఆదేశించారు. మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె సోమవారం తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చెరువుల్లో ప్రస్తుతం నీరు చేరినందున ఫీడర్ చానల్ పనులు, పారం పాండ్ నిర్మాణ పనులు చేయించాలన్నారు. వేతనదారులకు వేతనం గిట్టుబాటు అయ్యేలా కొలతల ప్రకారం పనులు చేయించాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనికి హాజరైన వారికి మాత్రమే మస్తర్లు వేయాలని చెప్పారు.

రేగిడి: మండలంలోని లక్ష్మణవలస, తోకలవలస తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీవో ఎస్.హరనాధరావు సోమవారం పరిశీలించారు. ప్రతీ పంచాయతీ పరిధిలో తప్పనిసరిగా పనులు ప్రారంభించాలని క్షేత్ర సహాయకులకు సూచించారు.



బాడంగి: ఉపాధి హామీ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సోమవారం సమావేశమై, పలు సూచనలు చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సర ఉపాధి హామీ పథకం లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 7 లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉందన్నారు. ప్రతీ గ్రామపంచాయతీలో 250 మందికి పైగా వేతనదారులకు పనులు కల్పించాలన్నారు. వేతనదారులకు రోజుకు కనీసం రూ.300 వచ్చేలా చూడాలన్నారు. సమావేశంలో ఏపీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వంగర: బాగెంపేటలో పశువైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి అనీల్‌కుమార్



రామభద్రపురం: తారాపురంలో ఆవుదూడకు వైద్య పరీక్షలు చేస్తున్న పశువైద్యాధికారిణి స్రవంతి



బాడంగి: పాల్తేరు పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీటీసీ దివ్య



బొబ్బిలిరూరల్: పశువైద్య సేవలను పరిశీలిస్తున్న ఏడీ విష్ణు

సంతకవిటి/వంగర/బొబ్బిలిరూరల్/రామభద్రపురం/బాడంగి: మండలాల్లోని పలు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు సోమవారం నిర్వహించారు. పాడిరైతులు శిబిరానికి తీసుకువచ్చిన పశువులు, ఇతర మూగజీవాలకు పశువైద్యాధికారులు వైద్య తనిఖీలు చేసి, అవసరమైన వాటికి ఉచితంగా మందులు అందజేశారు.

ఈ నెలాఖరు వరకు జరిగే ఈ శిబిరాల్లో అనారోగ్యం బారినపడిన పశువులకు చికిత్స అందించడంతో పాటు వ్యాధులకు గురికాకుండా ముందస్తు టీకాలు వేయడం జరుగుతుందని వైద్యాధికారులు తెలిపారు. ప్రతీ పాడిరైతు గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పోలిపల్లి పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు రేపు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి ఆలయ హుండీల్లో భక్తుల కానుకల రూపంలో చేరిన ఆదాయాన్ని బుధవారం లెక్కించనున్నామని ఆలయ ఈవో బీవీ మాధవరావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఆలయ ధర్మకర్త, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో హుండీలు తెరవనున్నామని, భక్తులు హాజరుకావాలని కోరారు.

గొల్లాది స్కూల్ కాంప్లెక్స్‌కు మంగళం

బాడంగి: మండలంలోని గొల్లాది స్కూల్ కాంప్లెక్స్‌కు కూటమి ప్రభుత్వం మంగళం పాడేసింది. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మండలంలో మొత్తం ఐదు స్కూల్ కాంప్లెక్స్‌లు ఉండగా, వాటిలో గొల్లాది స్కూల్ కాంప్లెక్స్‌ను రద్దుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలను బాడంగి, కోడూరు, పాల్తేరు స్కూల్ కాంప్లెక్సుల్లో కలపనున్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే వాడాడ స్కూల్ కాంప్లెక్స్‌కు ఆనవరం పాఠశాలను చేర్పనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

తెర్లాం: ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దారు జి.హేమంత్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదికకు పలువురు వచ్చి వారి సమస్యల పరిష్కారం నిమిత్తం సమర్పించిన అర్జీలను ఆయన స్వీకరించి, పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలు తెలియజేసేందుకు మండల ప్రజలు జిల్లా కేంద్రంలోని కలెక్టరు కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వెళ్లవద్దని, ఏ సమస్యనైనా మండలంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలోనే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



లింగాలవలస పూర్వ విద్యార్థులు

రేగిడి: మండలంలోని లింగాలవలస గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆ పాఠశాలలో సోమవారం జరిగింది. 2008–09 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులంతా కలిసి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరవేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దాసరి కృష్ణారావు, ఉపాధ్యాయులు వావిలపల్లి నాగభూషణరావు, అల్లెన తవిటిరావు, పీడీ మండల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. గజానికో గొయ్యి..



రేగిడి మండలం, ఉంగరాడమెట్ట–మజ్జిరాముడుపేట రోడ్డు అడుగుకో గుంత.. గజానికో గొయ్యి మాదిరి అధ్వానంగా కనిపిస్తోంది. రోడ్డు పొడవునా నెలకొన్న గుంతల కారణంగా అటువైపుగా ప్రయాణిస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గర్భిణులు, రోగులను వాహనాల్లో తరలించేటప్పుడు నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, రోడ్డు మరమ్మతులు జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

– రేగిడి

రూ.కోట్ల పనుల్లో నాణ్యత కరువు!



రాజాం ప్రధాన రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యత కరువవుతోంది. కొన్ని రూ.కోట్లతో అంబేద్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ ఐటీ వరకు చేపడుతున్న రోడ్డు పనుల్లో భాగంగా అండర్ డ్రైనేజీ నిర్మాణం చేసి దానిపై సీసీ పలకలు ఏర్పాటు చేశారు. అయితే ఇప్పుడు ఆ పలకలు పూర్తిగా పగిలిపోయాయి. పనుల్లో నాణ్యత లేకపోవడం వల్లే పలకలు పాడయ్యాయని స్థానికులు చెబుతున్నారు. ధ్వంసమైన పలకల స్థానంలో కొత్తవి ఏర్పాటుకు ఎంతో కొంత డబ్బు ఇస్తే గానీ వేయడం లేదని పలువురు దుకాణాదారులు ఆరోపిస్తున్నారు.

– రాజాం

పేదల భూములు కాపాడండి



రామభద్రపురం మండలం, కొట్టక్కి గ్రామ పేదల భూములు కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ కోరారు. ఇదే విషయమై ఆయన బొబ్బిలి ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. 2006లో 65 మంది నిరుపేదలకు ఎకరా చొప్పున ప్రభుత్వం భూమి పంపిణీ చేసిందని, అయితే సర్వే నంబరు 537లోని 30 ఎకరాలను రిటైర్డ్ ఉద్యోగి నాగరాజు తదితరులు అక్రమంగా అనుభవిస్తున్నారని ఆరోపించారు. ఆ భూమిని మళ్లీ సర్వే చేసి బాధితులకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఎ.ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.అప్పన్న, పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

– బొబ్బిలి

అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయాలి



గుయ్యానవలసలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని గుయ్యానవలస, నందబలగ, పెనుబాక గ్రామాల్లో సోమవారం పర్యటించిన ఆయన.. అక్కడ జరుగుతున్న పారిశుధ్య పనులపై ఆరాతీశారు. గ్రామాల్లోని వ్యర్థాలను చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించి, ఎరువు తయారు చేయాలని తెలిపారు. అలాగే ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు.

బీజామృతం తయారీపై అవగాహన

బొబ్బిలిరూరల్: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో రైతులకు గులిరాగి బీజామృతం తయారీపై సోమవారం అవగాహన కల్పించారు. అనంతరం నారుకట్టలు, విత్తనాలు శుద్ధి చేయడంలో బీజామృతం ఉపయోగాన్ని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వివరించారు. వరినాట్లు వేసే ముందు నారును బీజామృతంలో ముంచి, నారు కొనలను తుంచి, వరుస పద్ధతిలో నాటుకోవాలని తెలిపారు.